క్లుప్తంగా

కుమార స్వామికి షష్టి పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్టిని పురస్కరించుకుని బుధవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఆధ్యాత్మిక భావాలు అలవర్చుకోవాలి



సందేశమిస్తున్న జయదేవానంద స్వామిజీ

మిడుతూరు: పాఠశాల స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలను అలవర్చుకోవాలని జయదేవానంద స్వామిజీ అన్నారు. బుధవారం స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్య నిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామిజీ మాట్లాడుతూ ప్రతి పౌరుడు హిందూ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. బాల్యం నుంచే సనాతన ధర్మం వైపు నడిపించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, రామ్మోహన్, కాతా హరిసర్వోత్తమరెడ్డి, డాలు చిట్టిబాబు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..



మహానందికి వచ్చిన కొల్హాపూర్ పీఠాధిపతి

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో కొల్హాపూర్ నగరంలోని సుగురేశ్వర సంస్థాన మఠం 108వ పీఠాధిపతి శ్రీ గురుసిద్ధేశ్వర శివాచార్య మహాస్వామిజీ పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు, వేదపండితులు స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో ఆయనకు స్వామి వారి ప్రసాదాలు అందించారు.

కిందపడి యువకుడి మృతి

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరులో కాలుజారి పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు మిడుతూరు గ్రామానికి చెందిన మిద్దెల చిన్న వెంకటస్వామి రెండో కుమారుడు రాము(29) మద్యానికి బానిసవ్వడంతో పాటు కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. బుధవారం తన ఇంటి ముందు కాలు జారి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు.

మలేరియాను తరిమికొడదాం



ల్యాబ్ టెక్నీషియన్లకు శిక్షణ ఇస్తున్న జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు

నందికొట్కూరు: జాగ్రత్తలు పాటించి మలేరియా వ్యాధిని తరిమికొడదామని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జిల్లా మూడో బ్యాచ్ నియోజకవర్గ స్థాయి ల్యాబ్ టెక్నీషియన్లకు రెండు రోజుల పాటు మలేరియా, డెంగీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మలేరియా రక్త పూత ఏ విధంగా సేకరించాలో తెలుసుకోవాల్సిన ఎంతైన ఉందన్నారు. ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పించేందుకు వైద్యులు ప్రత్యే క శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి వరప్రసాదరెడ్డి, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణయ్య, ల్యాబ్ టెక్నీషియన్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు వందశాతం రాయితీ



ముసలిమడుగులో రైతులకు హార్టికల్చర్‌పై అవగాహన కల్పిస్తున్న ఏపీడీ అన్వారా బేగం

కొత్తపల్లి: ప్రభుత్వం హార్టీకల్చర్ ద్వారా పంటలు సాగుచేసుకునే రైతులకు వందశాతం రాయితీ ఇస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ అన్వారా బేగం సూచించారు. బుధవారం మండల పరిధిలోని ముసలిమడుగు, ఎర్రమఠం గ్రామాలలో ఉపాధి హామీ పనులను పరిశీలించి రైతులతో సమావేశం అయ్యారు. ఆమె మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా హార్టీకల్చర్ సాగులో 2024–25 సంవత్సరానికి గాను పండ్ల తోటలు సాగుచేసుకొనేందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం వందశాతం సబ్సిడీ కల్పిస్తోందన్నారు. ఎర్రమఠంలో 10 మంది రైతులు మామిడి ,జామ సాగుకు ముందుకురాగా ముసలిమడుగులో ఆరుగురు రైతులు మునగ సాగుచేసుకునేందుకు ముందుకు వచ్చారన్నారు. ఈనెల 31 లోగా పండ్ల తోటలు సాగుచేసుకోదలచి రైతులు భూమి వివరాలు, 1బి, అడంగల్, ఆధార్ జిరాక్స్‌లతో గ్రామఫీల్డ్ అసిస్టెంట్లను గాని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఏపీఓ రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించండి

పాములపాడు: మండలంలో రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని ఏపీడీ అన్వరాబేగం సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందిచే సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలానికి 150 ఎకరాల్లో పండ్ల తోటలు సాగుచేయించేలా టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. తప్పని సరిగా టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 86 ఎకరాల్లో సాగుకు పొలం గుర్తించడం జరిగిందన్నారు. జామ, కొబ్బరి, నిమ్మ, మామిడి, సీతాఫలము, సపోట, నారింజ, చీనీ, డ్రాగన్ ఫ్రూట్స్ పండ్ల తోటలు సాగు చేయవచ్చన్నారు. మొక్కలు ఇచ్చినప్పటి నుంచి సాగుకు ప్రభుత్వం పూర్తిగా రైతులకు ఆర్థిక సాయం అందజేస్తుందని వివరించారు. సమావేశంలో ఏపీఓ విమలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మండలాలకు చేరిన పాఠ్యపుస్తకాలు





జూపాడుబంగ్లా మండలానికి మంజూరైన పాఠ్య, నోట్ పుస్తకాలు

నందికొట్కూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బుధవారం నందికొట్కూరు మండలానికి పాఠ్యపుస్తకాలు చేరాయి, వీటిని ఎంఈవో ఫైజున్నీసాబేగం పరిశీలించారు. ప్రస్తుతం మెదటి విడతలో 7వేల పుస్తకాలు వచ్చినట్లు ఆమె తెలిపారు. త్వరలో అన్ని తరగతులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు వస్తాయన్నారు.

మొదటి విడత పాఠ్య, నోట్ పుస్తకాల మంజూరు

జూపాడుబంగ్లా: పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటిరోజే విద్యార్థులకు విద్యాకానుకలో భాగంగా పాఠ్య, నోట్‌పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టు తదితర వస్తువులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగా మండలానికి మొదటి విడతగా 1,2,3, తరగతులతో పాటు ఉర్దూ పాఠ్యపుస్తకాలు కలిపి మండలానికి 4,481 పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు. వీటితో పాటు 25,810 నోట్‌పుస్తకాలు మంజూరయ్యాయని చెప్పారు.

పాఠ్యపుస్తకాలు మంజూరు

మహానంది: మహానంది మండలంలోని 34 పాఠశాలల్లో 3,702 మంది విద్యార్థులు ఉండగా మొదటి విడతలో 3,817 పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన మరో 28, 200 పుస్తకాలు రావాల్సి ఉందని చెప్పారు.

నాటుసారా తరలిస్తే కఠిన చర్యలు



నాటుసారా చూపుతున్న ఎస్‌ఐ హరిప్రసాద్

కొత్తపల్లి: అక్రమంగా నాటుసారాను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్‌ఐ హరిప్రసాద్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని పాతమాడుగుల వద్ద దాడులు చేసి నాటుసారాను పట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. అటువంటివారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మండలంలోని పాతమాడుగుల గ్రామానికి చెందిన బొచ్చు సుబ్బన్న అనే వ్యక్తి తెలంగాణ రాష్ట్రం నుంచి కృష్ణానదిలో పుట్టిపై తెల్లటి ప్లాస్టిక్ సంచులు, బాటిళ్లలో నాటుసారాను సంగమేశ్వరం ఘాట్‌కు తరలించాడన్నారు. అక్కడి నుంచి నెంబర్ ప్లేట్‌లేని ఎక్స్‌ఎల్ మోటారు బైకుపై తరలిస్తుండగా సమాచారం మేరకు కాపుకాచి పాతమాడుగుల బస్సుస్టాప్ వద్ద పట్టుకున్నామని చెప్పారు. ప్లాస్టిక్ సంచుల్లో 35 లీటర్లు, బాటిళ్లలో 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దీంతో పాటు బైకును, పుట్టిని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేసి.. ఆత్మకూరు కోర్టులో జడ్జి ముందు హాజరు పరచగా ఆయన రిమాండ్ విధించారని వెల్లడించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత



సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల సామగ్రి, ఈవీఎంలు భద్రపరిచిన ఆర్జీఎం, శాంతిరామ్, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లను నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కేంద్ర బలగాల గార్డులు, జిల్లా ఆర్మ్‌డ్ పోలీసులు, సివిల్ పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భద్రతా సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా చూసుకోవాలన్నారు. కౌంటింగ్ రోజున ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణలో పహారా ఉంటుందని వివరించారు. అలాగే జిల్లావ్యాప్తంగా పోలీసు పికెట్లు, మొబైల్ పెట్రోలింగ్ పార్టీ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల విజయోత్సవ సంబరాలు, బహిరంగ కేక్ కటింగ్‌లు, ర్యాలీలపై నిషేధం ఉందని ఎవరూ నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఏ చిన్న సంఘటన జరిగినా తక్షణమే పోలీసుకు సమాచారం ఇవ్వాలన్నారు. అసాంఘిక శక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. అలాగే గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా గ్రామ సభల ద్వారా పోలీసులచే అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్బీ డీఎస్పీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ వెంకటేశ్వరరావు, పాణ్యం సీఐ నల్లప్ప, ఎస్‌ఐ అశోక్ తదితరులు ఉన్నారు.

కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలి

పగిడ్యాల: ఉపాధి హామీ పథకం కూలీలకు కుటుంబానికి 200 రోజుల పని కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు పి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని సంకిరేణిపల్లెలో ఉపాధి కూలీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పగిడ్యాల మండలంలోని బీరవోలు, నెహ్రూనగర్, ఎం.ఎస్. ఘణపురం, ప్రాతకోట తదితర గ్రామాలు నీటి ముంపు పునరావాస గ్రామాలన్నారు. ఈ గ్రామాల్లోని ప్రజలు ఎక్కువ శాతం మునక భూములపైనే ఆధారపడి జీవనం సాగిస్తారని చెప్పారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించి రోజుకు రూ. 600లు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూలీలు వెంకటస్వామి, బాలస్వామి, జయన్న, కురుమన్న, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఎప్పుడొచ్చినా అడిగేవారెవరు?



తంగడంచ ఫారం ఏడీఏ కార్యాలయం

జూపాడుబంగ్లా: కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారులు, సిబ్బంది వారి ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నా పట్టించుకొనే నాథులే కరువయ్యారు. రాష్ట్రంలోని విత్తనోత్పత్తిక్షేత్రాల్లో అత్యంత పెద్దదైన తంగడంచ ఫారం అధికారులు విధుల నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. బుధవారం ఉదయం 10.45 గంటలైనా అధికారులెవ్వరూ విధులకు హాజరుకాకపోవడం గమనార్హం. ఫారం అటెండర్ మాత్రమే కార్యాలయం తలుపులు తీసి ఉంచాడు. ఫారం ఏడీఏ, సిబ్బంది కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. ఈ విషయమై ఫారం ఏఓ కిషోర్‌ను సంప్రదించగా తాను రెండు రోజుల నుంచి సెలవుల్లో ఉన్నట్లు తెలిపారు.



ఖాళీగా ఉన్న ఫారం ఏడీఏ సీటు

ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా హృదయరాజు

నంద్యాల (న్యూటౌన్): ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా హృదయరాజు ఎంపికపై నంద్యాల జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేస్తూ అభినందించినట్లు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కృష్ణా జిల్లా గుడివాడ పట్టణంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో హృదయరాజును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. ఏపీ జేఏసీగా ఉంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమ పోరాటాల్లో సమర్థవంతంగా పనిచేస్తున్నారన్నారు. మిడుతూరు మండలం కలబందపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా హృదయరాజు పనిచేస్తున్నారన్నారు.

కాయ్ రాజా కాయ్..

- మహానంది, బండిఆత్మకూరు మండలాల ఎన్నికల ఫలితాలపై ఆసక్తి
- గతంలో ఎన్నడూ లేని విధంగా ఉత్కంఠ
- ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపుపై భారీగా బెట్టింగ్‌లు

మహానంది: గతంలో ఎన్నడూ లేని విధంగా 2024 అసెంబ్లీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ఫలితాలకు సమయం దగ్గరపడుతుండటంతో ఎవరు గెలుస్తారో అన్న ఉత్కంఠ నెలకొంది. దీంతో పాటు ఈ సారి ఎన్నికల ఫలితాలపై తీవ్ర పోటీ, ఆసక్తి ఉండటంతో గెలుపోటములపై పందేలు జోరుగా నడుస్తున్నాయి. మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో ఏ పార్టీకి ఎంత మెజారిటీ వస్తుందన్న అంశంపై తీవ్ర ఆసక్తి రేకెత్తిస్తుండటంతో భారీగా బెట్టింగ్‌లు పెట్టుకున్నారు.

పెరిగిన ఓటింగ్..

మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో గతంలో కంటే ఈ సారి పోలింగ్ శాతం అధికంగా నమోదైంది. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల ఓటింగ్‌లో నియోజకవర్గంలో బండిఆత్మకూరు మండలం టాప్‌లో నిలిచింది. మొత్తం 37,794 మంది ఓటర్లు ఉండగా, పురుషులు ఓటర్లు 16,912 మంది, మహిళలు 16,961 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో అత్యధికంగా 89.21 శాతం పోలింగ్ నమోదైంది. మహానంది మండలంలో 29,760 మంది ఓటర్లు ఉండగా 13,022 మంది పురుషులు, 12,574 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 86.03 శాతం పోలింగ్ నమోదైంది. అయితే ఈ రెండు మండలాలు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి ఎప్పుడూ అండగా నిలుస్తూ వస్తున్నాయి. అందులో భాగంగా ఈ సారి సైతం వైఎస్సార్‌సీపీకి మెజారిటీ వస్తుందని పార్టీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి.

మహానందిపై ప్రత్యేక దృష్టి..

నియోజకవర్గాల పునర్విభజనకు ముందు మహానంది, బండిఆత్మకూరు మండలాలు నంద్యాల నియోజకవర్గంలో ఉండేవి. గతంలో మహానంది మండలంలో ఎప్పుడూ టీడీపీకే మెజారిటీ వచ్చేది. కానీ పునర్విభజన తర్వాత శ్రీశైలం నియోజకవర్గంలో కలవడం, అభ్యర్థులు మారడంతో ఫలితాలు తారుమారవుతూ వస్తున్నాయి. గత ఎన్నికల్లోనూ మహానంది మండలంలో వైఎస్సార్‌సీపీకే మెజారిటీ లభించింది. ఈ సారి కూడా మెజారిటీ వస్తుందని పందేలు జోరుగా కాశారు.

రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు బెట్టింగ్

అభ్యర్థుల గెలుపుపై ఒక్కొక్కరు వారి స్థాయిని బట్టి రూ.లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు పందెం కాశారు. ఇందులో కొందరు 3 నుంచి 5వే మెజారిటీకి ఒక రకంగా, ఒక్క ఓటైనా మెజారిటీ అని మరో రకంగా బెట్టింగులు పెట్టుకున్నారు. రెండు మండలాల వారే కాకుండా నంద్యాల నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులు, బెట్టింగ్ రాయుళ్లు సైతం మహానంది, బండిఆత్మకూరు మండలాల ఫలితాలపై జోరుగా పందేలు వేసుకున్నారు.

పంట కాలువలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు: సిద్ధాపురం చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వెలుగోడు జలాశయం నుంచి నీళ్లు వదులుతున్నప్పటికీ చెరువు ఆయకట్టు పరిధిలో పంట కాలువలు ఏర్పాటు చేయడంలో పాలకులు, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ అన్నారు. సిద్ధాపురం చెరువు కింద పంట కాలువలు ఏర్పాటు చేసి నీరు అందించాలన్నారు. బుధవారం మండలంలోని నల్లకాల్వ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. వారు మాట్లాడుతూ పంటకాలువలు లేక గతేడాది రైతులందరూ తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పంట కాలువలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శులు రామచంద్రుడు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది: మహానంది దేవస్థానంలో గురువారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ స్థానిక అభిషేక మండపంలో జరిగే హుండీ కానుకల లెక్కింపులో శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వర, శ్రీ కోదండరామాలయం ఆలయాలతో పాటు అన్నదానం, గోసంరక్షణ విభాగాల్లోని హుండీ కానుకలను లెక్కిస్తామన్నారు. సిబ్బంది అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

నందికొట్కూరు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ ఫైజున్నీసాబేగం తెలిపారు. బుధవారం సైన్స్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైన్స్ పరీక్షకు 529 మంది విద్యార్థులకు గాను 281 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైన్స్ పరీక్షకు 255 మందికి గాను 136 మంది, గవర్నమెంట్ హైస్కూల్‌లో 274 మందికి గాను 145 మంది సప్లిమెంటరీ విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షకు 273 మంది విద్యార్థులు గైహాజరైనట్లు చెప్పారు.

88 మంది విద్యార్థులు గైర్హాజరు

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి సప్లమెంటరీ పరీక్షా కేంద్రంలో 207 మందికి 88 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి సాయితిమ్మయ్య, డిపార్టు మెంటల్ అధికారి మహేష్ తెలిపారు. బుధవారం నిర్వహించిన సైన్సు పేపర్ 1 (ఫిజిక్స్) పరీక్షలో 207 మంది హాజరు కావాలసి ఉండగా 88 మంది గైర్హాజరైనట్లు వారు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వండిపెట్టాలి



శిక్షణ ఇస్తున్న ఎంఈఓ-2 శ్రీనివాసులు

జూపాడుబంగ్లా: విద్యార్థుల సంక్షేమార్థం ప్రభుత్వం అమలు చేసిన మెనూ ప్రకారం వంట నిర్వాహకులు నాణ్యమైన భోజనం వండిపెట్టాలని ఎంఈఓలు చిన్నమద్దిలేటి, శ్రీనివాసులు, డాక్టర్ సభా సూచించారు. బుధవారం జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాలలో వంటనిర్వాహకులకు మధ్యాహ్న భోజనంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులను తమ బిడ్డలుగా భావించి ఇంట్లో మీ పిల్లలకు వంటలు ఎలా వండిపెడతారో అలా వంటలు వండాలన్నారు. వంటలు వండేవారు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక వైద్యురాలు డాక్టర్ సభా సూచించారు. ఇష్టానుసారంగా వంటలు వండితే ఆహారం కలుషితమై విద్యార్థులు రోగాలబారినపడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అంబమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

పాములపాడు: స్థానిక ఏఎస్‌ఆర్‌జెడ్పీ హైస్కూలులో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంఈఓ బాలాజీనాయక్ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ప్రతి రోజు మెటీరియల్ ఎలా తయారు చేసుకోవాలి అనే విషయాన్ని వీడియో ద్వారా ప్రదర్శించారు. భోజనంలో న్యూట్రిన్స్, ప్రొటిన్స్, విటమిన్స్ ఏ కూరగాయల్లో ఏమి ఉంటుందని వివరించారు.

పశువులకు వ్యాక్సిన్ తప్పనిసరి



గువ్వలకుంట్లలో టీకా వేస్తున్న పశువైద్యాధికారి భువనేశ్వరి

కొత్తపల్లి: బర్రెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలలో సీజనల్ వ్యాధులను నివారించుటకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని పశువైద్యాధికారి భువనేశ్వరి సూచించారు. బుధవారం మండలంలోని పాతమాడుగుల, ఎర్రమఠం, గువ్వలకుంట్ల, వీరాపురం గ్రామాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నల్లపశువు (బర్రెలు)లలో గోంతువాపు వ్యాధి రాకుండా, వ్యాధిని నివారించేందుకు హెచ్ఎస్ (హెమరెజిక్ సెప్టిసిమియా) వ్యాక్సిన్‌ను, తెల్లపశువుల (ఆవులు, ఎద్దులు)లో కాళ్లలో దెబ్బలు తగిలి నల్లగా మారిన మచ్చలను తగ్గించేందుకు బ్లాక్ క్వాటర్ వ్యాక్సిన్‌ను వేస్తున్నామన్నారు. అదేవిధంగా గొర్రెలలో తొలకరి వర్షాలకు మొలిచిన గడ్డిని తినడంతో సోకే బాక్టిరియా వ్యాధులను అరికట్టుటకు ఎంటిరో టాక్సీనియమా వ్యాక్సిన్ వేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు ఈ గ్రామాలలో 2500 పశువులు, జీవాలకు వ్యాక్సిన్లు వేశామన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

వెలుగోడు: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని వేల్పనూరు, అబ్దులాపురం గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. జూన్ 4వ తేదీన జరుగునున్న ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ఉండేందుకు, ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీస్ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో అందరూ వివాదాలకు దూరంగా ఉండాలని, శాంతియుతంగా మెలగాలని సూచించారు. జిల్లా మొత్తం 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకూరు టౌన్, రూరల్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణం, ఎస్‌ఐలు హరిప్రసాద్, అశోక్, భూపాలుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయోత్సవాలు నిషేధం

మహానంది: ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం గ్రామాల్లో ఎవరైనా ర్యాలీలు, బాణాసంచా కాల్చడం నిషేధమని బండిఆత్మకూరు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించి గ్రామాల్లో ప్రశాంత వాతావరణ ఉండేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

సారా విక్రేత అరెస్టు

నందికొట్కూరు: నాటుసారా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడం తప్పదని టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని నీలిషికారి పేటలో నాటుసారా విక్రయిస్తున్న నీలిషికారి సురేష్‌ను అరెస్టు చేశారు. అతని వద్ద 20 లీటర్ల సారాని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి బుధవారం తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు. అదేవిధంగా ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.